క్లుప్తంగా

శ్రీరామనవమి ఉత్సవాలకు రావాలని ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దంపతులకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని అభయ సీతారామాలయంలో ఈనెల 6న జరిగే శ్రీరామనవమి ఉత్సవాలకు రావాలని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సుజాత దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు పురుషోత్తం, రాజు, శ్రీనివాస్‌గుప్తా, ఆలయ అర్చకుడు ఫణీంద్ర శర్మ తదితరులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మాజీ ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా యాదగిరి



రామాయంపేట(మెదక్): పట్టణంలోని లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా దేమే యాదగిరి వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు స్థానిక మహర్షి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా క్లబ్ సభ్యుడు యాదగిరి, కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా స్వామి ఎన్నుకున్నారు. క్లబ్ సేవలను విస్తృత పరుస్తామని నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు పేర్కొన్నారు. తమను ఎన్నుకున్నందుకు గాను వారు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

డంప్‌యార్డును ఎత్తి వేయాలి

నర్సాపూర్: ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును ఎత్తి వేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో డంప్‌యార్డు ఏర్పాటు చేస్తున్నప్పటికీ మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌పై ఎక్కువ దుష్ప్రభావం ఉంటుందని చెప్పారు. డంప్‌యార్డుతో నర్సాపూర్ అడవులు కలుషితమవుతాయని, పట్టణ చెరువు కలుషితమైతే దాని కింద ఉన్న గొలుసుకట్టు చెరువులు సైతం కలుషితమయ్యే ప్రమాదం ఉంటుందని, చెరువులపై ఆధారపడే కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంటుందని మురళీయాదవ్ వివరించారు. అన్ని వర్గాల ప్రజలు డంప్‌యార్డును ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తున్నందున ప్రభుత్వం పునరాలోచించి డంప్‌యార్డును అక్కడి నుంచి ఎత్తి వేయాలన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితుడు రాఘవేంద్రశర్మ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గజగట్లపల్లి గ్రామంలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు బీష్మాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో వేద పండితులు రాఘవేంద్రశర్మ, మాజీ సర్పంచ్ రవీందర్ దంపతుల చేతులమీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదం, అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వార్షికోత్సవాలకు ఆలయం ముస్తాబు



ఆలయంలో కొలువైన దేవతామూర్తులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ 40వ వార్షికోత్సవాలు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు గిరీశ్వరశర్మ అన్నారు. ఈ సందర్భంగా గణపతి పూజ, అఖండ దీపారాధన, స్వస్తిపుణ్యాహవచనం, స్థాపిత దేవతామూర్తులకు పంచామృత అభిషేకాలు, సుదర్శన హోమంతో పాటు వేంకటేశ్వరస్వామి, శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేకువజాము నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వెల్లడించారు. వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను పలువురు నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డికి అందజేశారు.

పరుచుకున్న పచ్చదనం



నార్సింగి మండలం శేరిపల్లిలో వరినాటుతో పరుచుకున్న పచ్చదనం



శేరిపల్లి గుండుచెరువు లో ఉదయిస్తున్న సూర్య కిరణాలు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గుండుచెరువు కింద పంటలసాగు పెరిగింది. దీంతో చెరువుకింద పచ్చదనం పరుకొని కనివిందు చేస్తుంది. అదే సమయంలో చెరువు నిండానీరు ఉండడంతో ఉదయం సూర్యోదయం నిత్యం వాకింగ్‌కు వెళ్లే పాదచారులకు ప్రకృతి అందాలు కనివిందుచేస్తున్నాయి.

చి'వరి'కి మేతగా... పంట



రంగంపేట శివారులో వరి పంట మేస్తున్న ఆవులు

కొల్చారం(నర్సాపూర్): ఇంటిల్లిపాది రెక్కలు ధార పోసి పంట సాగు చేస్తే, చేతికి వస్తుందన్న దశలో బోర్లల్లో నీరు అడుగంటింది. గింజ పాలు తొడిగి గట్టిపడే దశలో ఎకరాల్లో వరి పొలం కళ్ల ఎదుట ఎండిపోతున్న పరిస్థితి. చేసేది లేక పంట మూగజీవాలకైనా ఆహారంగా పనికి వస్తుందనుకోవడం తప్ప రైతులకు మిగిలింది ఏమీ లేదు.

దేవుళ్లకు.. దిక్కెవరు?

- శిథిలావస్థలో ఆలయాలు
- విగ్రహాలకు కరువైన రక్షణ
- ధూపదీపాలకు నోచుకోని దైన్యం
- పలుచోట్ల అపహరణ
- పట్టించుకోని అధికారులు



చండూర్ రామలింగేశ్వర ఆలయంలో పాక్షికంగా ధ్వంసమైన విగ్రహాలు



ఫైజాబాద్‌లో శిథిలావస్థలో ఉన్న వేంకటేశ్వర ఆలయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): పురాతన దేవాలయాల్లో గుప్త నిధులు దొరుకుతాయనే అత్యాశతో కొందరు దుండగులు ఆలయాల్లోని విగ్రహాలను ధ్వంసం చేయడంతో పాటు పలు దేవతామూర్తులను ఎత్తుకెళ్లిన సంఘటనలు గతంలో జరిగాయి. మండలంలోని చండూర్ గ్రామంలో రామలింగేశ్వరస్వామి ఆలయానికి 900 సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ ఆలయంలో గతంలో రజాకర్లు దాడులు చేసి దేవతామూర్తుల విగ్రహాలను పాక్షికంగా ధ్వంసం చేసినట్లు గ్రామంలోని ఆలయ అర్చకుడు తెలిపారు. ఆలయంలోని కొన్ని దేవతా విగ్రహాలను తీసుకెళ్లి గుర్తు తెలియని ప్రదేశాలలో పడేశారని స్థానికులు తెలిపారు. ఆలయంలోని భారీ నంది విగ్రహం తలను విరగొట్టి చండూర్ గ్రామ చెరువులో పడేశారు. ప్రస్తుతం ఆ నంది విగ్రహం చెరువులోనే ఉంది. అజ్జమర్రి గ్రామ నడిబొడ్డున సుమారు 200 సంవత్సరాల క్రితం నాటి వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. గ్రామంలోని వృద్ధులను అడిగినప్పటికీ ఆలయం వారి చిన్ననాటి నుంచే శిథిలావస్థలో ఉందన్నారు. ప్రస్తుతం ఈ ఆలయం పూర్తిగా కనుమరుగైంది. ఆలయంలో ఉన్న వేంకటేశ్వర స్వామి విగ్రహన్ని, భారీ నంది విగ్రహాన్ని దొంగలు ఎత్తుకెళ్లారని స్థానికులు తెలిపారు. ఈ ఆలయం పూర్తిగా శిథిలమైంది. మరి కొన్ని రోజుల్లో ఈ పురాతన ఆలయం గురించి మూలాలు కూడా దొరక్కుండా పోతాయి. మండలంలోని ఫైజాబాద్ గ్రామ శివారులో మరో వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. కొన్నేళ్ల క్రితం ఫైజాబాద్ గ్రామానికి దొంగతనానికి వచ్చిన దొంగకు ఏమీ దొరక్క పోవడంతో కోపంతో స్వామి వారి ఆలయానికి వచ్చి విగ్రహం తల విరగొట్టాడని స్థానికులు చెబుతున్నారు. ఈ మధ్య కాలంలో మరికొందరు దుండగులు గుడిలో గుప్త నిధులు దొరుకుతాయనే స్వార్థంతో గర్భగుడిలో తవ్వకాలు జరిపి, అతంతమాత్రంగా ఉన్న గుడిని పూర్తిగా ధ్వంసం చేశారు. జగ్గంపేట గ్రామంలో స్వయంభూ లింగం ఉంది. గ్రామంలో చెట్టు కింద ఉన్న ఈ స్వయంభూ లింగం ఆదరణకు నోచుకోవడం లేదు. కేవలం శివరాత్రి రోజు మాత్రమే భక్తులకు ఈ లింగం గుర్తొస్తుంది. అధికారులు, ప్రజలు పురాతన దేవాలయాల అభివృద్ధికి పాటు పడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పూర్తిగా ధ్వంసమైంది



అజ్జమర్రి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం పూర్తిగా ధ్వంసమైంది. నా చిన్నతనంలోనే ఆలయం శిథిలావస్థలో ఉంది. అందులోని దేవతామూర్తుల విగ్రహాలను దొంగలు ఎత్తుకెళ్లారని మా పెద్దలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి.

– సురేందర్‌రెడ్డి, అజ్జమర్రి

కమిటీ ఏర్పాటైనా ఫలితం లేదు



ఫైజాబాద్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన గుప్తనిధుల తవ్వకాల అనంతరం గ్రామంలో ఆలయ కమిటీ ఏర్పాటు చేశాం. టీటీడీ సభ్యులు వచ్చి ఆలయాన్ని సందర్శించిన, గ్రామంలోని ఆలయ అభివృద్ధిలో ఎలాంటి మార్పు లేదు. రోజురోజుకు ఆలయం శిథిలమైపోతోంది.

– ఎంసీ విఠల్, ఫైజాబాద్

రోడ్డు ఎత్తుతో నిత్యం ప్రమాదాలు



ప్రమాదాలు జరుగుతున్నది ఈ ప్రదేశంలోనే..

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట గ్రామంలో నుంచి ప్రధాన హైవే రోడ్డుకు వచ్చేందుకు ఉన్న రోడ్డు ఎత్తుగా ఉంది. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామంలో నుంచి తూప్రాన్ – నర్సాపూర్ హైవే పైకి ఎక్కేందుకు రోడ్డు ఎత్తుగా ఉండడం వల్ల ప్రజలు, వాహనదారులు నిత్యం అదుపు తప్పి పడి గాయాల పాలవుతున్నారు. హైవే నుంచి గ్రామంలోకి వెళ్లేదారిని సమాంతరంగా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత హైవే, పంచాయతీ సిబ్బంది ప్రమాదభరింతగా ఉన్న ఎత్తుపల్లాల రోడ్డుని సరిచేసి ప్రమాదాలు నివారించాల్సిన అవసరం ఉంది. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శి రమాదేవి దృష్టికి తీసుకెళ్లగా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి సీసీ రోడ్డు, మురికికాల్వ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు వద్ద సీసీ వేసి ఎత్తుపల్లాలను సరిచేస్తామని చెప్పారు.

పిల్లల హక్కుల కోసం పోరాటం



మాట్లాడుతున్న కైలాస్

రామాయంపేట(మెదక్): చిన్నపిల్లల రక్షణ, హక్కుల కోసం జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ పోరాడుతుందని విజన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ వంగరి కైలాస్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఒక బాలికపై అత్యాచార యత్నం కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక స్టే విధించిందన్నారు. విజన్ సంస్థ మెదక్, నిర్మల్ జిల్లాల్లో బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తుందన్నారు. అరాచకాలకు, అన్యాయాలకు బలవుతున్న వారికి తమ సంస్థ అండగా నిలుస్తుందని తెలిపారు. బాలలపై జరుగుతున్న దౌర్జన్యాలు, అరాచకాలను ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తే, వారి తరఫున పోరాడుతామని కైలాస్ హామీ ఇచ్చారు.

మురికి కాల్వ ధ్వంసం



తునికిలో ధ్వంసమైన మురికి కాల్వ

కౌడిపల్లి(నర్సాపూర్): మురికి కాల్వ ధ్వంసం కావడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇది మండలంలోని తునికి గ్రామంలో చోటు చేసుకుంది. తునికిలో ప్రసిద్ధి చెందిన నల్లపోచమ్మదేవి ఆలయానికి వెళ్లే దారిలో గ్రామ పంచాయతీ సమీపంలో మురికి కాల్వ ధ్వంసమైంది. దీంతో పాటు పక్కన సీసీరోడ్డు సైతం వాహనాల దాటికి ధ్వంసమైయి, పారిశుద్ధ్య లోపం ఏర్పడింది. గ్రామంలో పలు చోట్ల మురికి కాల్వలు అధ్వానంగా ఉన్నాయని గ్రామస్తులు చెపుతున్నారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోచమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ



చేగుంట పోచమ్మ ఆలయం వద్ద ప్రహరీ ఏర్పాటు చేయిస్తున్న కుల సంఘాల నాయకులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట పోచమ్మ గుడి సమీపంలోని ఆలయ స్థలానికి గ్రామస్తులు ప్రహరీ ఏర్పాటు చేయించారు. మంగళవారం రోజున గ్రామంలోని పలు కులాల సంఘాల నాయకులు సమావేశం నిర్వహించి, పోచమ్మ ఆలయ స్థలం కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నట్లు గుర్తించారు. గ్రామస్తులు ఆలయ ప్రాంగణానికి చేరుకొని ఆలయానికి సంబంధించిన 549 గజాల స్థలానికి హద్దులు గుర్తించి, ప్రహరీ ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్లు పలు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



టేక్మాల్(మెదక్): హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మనోహరాబాద్(తూప్రాన్): మల్లన్న ఆలయం వద్ద ఒగ్గుకళాకారులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని పబ్బతి హన్‌మాన్ దేవాలయంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందనం, అభిషేకం, అర్చన వంటి విశేష పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భజన చేస్తూ హనుమాన్ కీర్తనలు ఆలపించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటూ అన్నప్రసాద వితరణ చేశారు.

కాళ్లకల్‌లో మల్లన్న ఆలయం వద్ద..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామ మల్లన్న ఆలయం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం రేణుకమాత కల్యాణం, నాగెల్లి నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

శంఖాపూర్–ఖాజాపూర్ రాకపోకలు నిలిపివేత

- శంఖాపూర్ రైల్వేగేట్ మూసివేత
- బ్రిడ్జి పనులు ప్రారంభం



శంఖాపూర్ రైల్వే గేట్ మూసివేసిన అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శంఖాపూర్ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న రైల్వేగేట్‌ను మూసివేసి అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం పనులను రైల్వే అధికారులు ప్రారంభించారు. సోమవారం శంఖాపూర్ నుంచి మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి రాకపోకలు నిలిపివేశారు. దీంతో ఖాజాపూర్ నుంచి శంఖాపూర్ మీదుగా జప్తిశివనూర్ జాతీయ రహదారికి రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు గేట్‌కు సమీపంలోని రైల్వే చిన్న బ్రిడ్జి కింద నుంచి రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉన్నప్పటికీ కార్లు, లారీలు రాకపోకలు పూర్తిగా ఈ దారి నుంచి వచ్చేందుకు అవకాశం లేకుండా పోయింది. వాహనదారులు, ప్రజలు గమనించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టే వరకు సహకరించాలని రైల్వే అధికారులు కోరారు.

ఎల్‌ఓసీలు అందజేత



ఎల్‌ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: వైద్యం కోసం ఇద్దరికీ ఎల్‌ఓసీలు అందజేసినట్లు స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. మంగళవారం ఆమె తన నివాసంలో లబ్ధిదారులకు వాటిని అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద మంజూరయ్యే ఎల్‌ఓసీలతో అవసరమైన చికిత్స పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. నర్సాపూర్‌కు చెందిన భూషణ్‌కు రూ.రెండు లక్షల ఎల్‌ఓసీ, శివ్వంపేటకు చెందిన నాగమణికి రూ.లక్ష ఎల్‌ఓసీని అందజేశామన్నారు.

రాజిపేట ఎల్లమ్మదేవి ఆలయంలో చోరీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేట రేణుక ఎల్లమ్మదేవి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. గ్రామ సమీపంలోని గ్రామ గౌడసంఘం రేణుకా ఎల్లమ్మ ఆలయం ద్వారం తాళం పగులగొట్టి బీరువాలోని సామగ్రితో పాటు అమ్మవారి మెడలోని హారం, పూజాసామగ్రి, హుండీలోని డబ్బులు చోరీ చేశారు. మొత్తం సుమారు రూ. 5వేల విలువ వరకు ఉంటుందని గౌడసంఘం సభ్యులు తెలిపారు. ఈ విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేటలో కొలువైన ముత్యాలమ్మ దేవి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు బుధవారం జరగనున్నాయి. వేడుకల్లో భాగంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ పూజ కార్యక్రమాలతో పాటు బోనాల ఊరేగింపు ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రంగంపేట ఆశ్రమం పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి హాజరవుతారని, అనంతరం అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు.

ఢిల్లీ ధర్నాకు వెళ్లిన విశ్వకర్మ నేతలు



ఢిల్లీ వెళ్తున్న విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షుడితో జిల్లా సంఘం నాయకులు

నర్సాపూర్: ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఈనెల 2న నిర్వహించ తలపెట్టిన ధర్నాకు జిల్లా విశ్వకర్మ సంఘం నాయకులు మంగళవారం బయలుదేరి వెళ్లారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథం ఆధ్వర్యంలో జిల్లా సంఘం ప్రతినిధులు భిక్షపతిచారి, వెంకటేష్‌చారి, నరేందర్‌చారి, ప్రవీణ్‌చారి తదితరులు ఢిల్లీకి వెళ్తున్నట్లు చెప్పారు. బుధవారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్‌తో చేసే ధర్నాలో పాల్గొంటామని వారు వివరించారు.



బుజ్రాన్‌పల్లిలో కుస్తీపోటీలను తిలకిస్తున్న ప్రజలు

ఆకట్టుకున్న కుస్తీపోటీలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లిలో వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో స్వామివారికి సుప్రభాతసేవ, అభిషేకాలు, పుష్పార్చన తదితర పూజలు చేశారు. రెండో రోజు మంగళవారం ఆలయ ఆవరణలో కుస్తీ పోటీలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కార్మికుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమలో కార్మిక భద్రత లేకపోవడంతోనే కార్మికుడు మృతి చెందాడని, వారి కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి శ్రీయాన్ పాలిమార్స్ యాజమాన్యంను డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కొండాపూర్ పరిశ్రమల వాడలోని శ్రీయాన్ పాలిమార్స్ పరిశ్రమలో పనిచేసే కార్మికుడు రఘునాథ్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. తోటి కార్మికుడు మృతి చెందటంతో పరిశ్రమ వద్ద కార్మికులు ఆందోళన చేపట్టామన్నారు. పరిశ్రమ యాజమాన్యం వెంటనే స్పందించి మరణించిన కార్మికుడిని సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లోని నివాసానికి తరలించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.